

శాసనసభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

ఇక జాప్యం వద్దు..

నీట్‌ను రద్దు చేయండి

● అసెంబ్లీలో స్టాలిన్ ప్రత్యేక తీర్మానం

చెన్నై, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే నీట్‌ను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శాసనసభలో తీర్మానం ప్రతిపాదించారు. అదే సమయంలో నీట్ నుంచి రాష్ట్రాన్ని మినహాయించాలని కోరుతూ అసెంబ్లీలో ప్రతిపాదించి, ఏకగ్రీవంగా ఆమోదించి ప్రస్తుతం రాష్ట్రపతి పరిశీలనలో ఉన్న నీట్ వ్యతిరేక బిల్లుకు వెంటనే ఆమోదం తెలపాలని కూడా డిమాండ్ చేశారు. నీట్ రద్దు చేసినట్లయితే మునుపటి లాగే ప్లస్-2 పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు పొందే మార్కుల ఆధారంగా వైద్య కోర్సుల్లో ప్రవేశం కల్పించే పాతపద్ధతిని అమలు చేస్తామన్నారు. శాసనసభలో శుక్రవారం ఉదయం ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టిన అనంతరం సీఎం స్టాలిన్ ప్రసంగిస్తూ... వైద్య, ఆరోగ్య రంగంలో దేశానికే తలమానికంగా తమిళనాడు పేరు గడించిందని, ఎన్నో యేళ్లుగా రాష్ట్రంలో అమలు చేసిన నాణ్యమైన విద్య, అడ్మిషన్ల విధానాల వల్లే ఆ కీర్తి లభించిందన్నారు. ఆచార్య ఆనంత కృష్ణన్ నేతృత్వంలోని కమిటీ సిఫారసుల ప్రాతిపదిక వైద్యం సహా అన్ని సాంకేతిక విద్యలకు సంబంధించిన ప్రవేశ పరీక్షలను రద్దు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధికి దక్కుతుందన్నారు. పాఠశాల విద్య మార్కుల ప్రతిపాదికగా సామాజిక న్యాయాన్ని, అన్ని వర్గాల వారికి సమాన అవకాశాలు నిర్ధారించే విధంగా ప్రవేశపరీక్షలను జరుపుతూ వచ్చామన్నారు. ఆ పద్ధతుల వల్లే రాష్ట్రంలో నాణ్యమైన వైద్యుల సంఖ్య పెరిగిందని, వీరంతా అంతర్జాతీయ ప్రమాణాలతో వైద్య సేవలందించ గలిగారన్నారు. అయితే 2017లో కేంద్ర ప్రభుత్వం నీట్‌ను నిర్బంధం చేసి పేద, మారుమూల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసిందని స్టాలిన్ ఆరోపించారు. నీట్‌కు శిక్షణ పొందలేని గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులంతా డాక్టర్లు కాలేకపోతున్నామనే వేదనతో ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు కూడా అధికమయ్యాయని చెప్పారు. ఈ అంశాలను పరిశీలించిన మీదటే నీట్ అమలు చేసినప్పటి నుండి రాజకీయపరంగా, చట్టపరంగా, ఉద్యమాల ద్వారా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. నీట్‌కు వ్యతిరేకంగా డీఎంకే యువజన విభాగం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ ఉద్యమం జరిగిందన్నారు. నీట్‌ను వ్యతిరేకించడంలో పాలకపక్షమే కాకుండా ప్రతిపక్షాలు కూడా ముందున్నాయని, ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ ఏకే రాజన్ కమిటీ సిఫారసుల ప్రాతిపదికగా శాసనసభలో 2021 సెప్టెంబర్ 13న రాష్ట్ర వైద్య విద్యా సంబంధిత ప్రవేశ చట్టం 2021 పేరుతో ముసాయిదా చట్టాన్ని ఏకగ్రీవంగా ఆమోదించిందని చెప్పారు. ఆ తర్వాత నీట్‌కు వ్యతిరేకంగా సుదీర్ఘ న్యాయపోరాటం సాగించిన తర్వాత కూడా గవర్నర్ ఆ ప్రత్యేకచట్టం బిల్లను ఆమోదించకుండా పునఃపరిశీలన చేయాలంటూ తిప్పిపంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పరిస్థితుల్లో 2022 ఫిబ్రవరి 5న నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో తీసుకున్న ఏకాభిప్రాయం ప్రకారం ఆ ముసాయిదా చట్టాన్ని 2022 ఫిబ్రవరి 8న మళ్ళీ శాసనసభలో ఆమోదించి గవర్నర్ ఆమోదం కోసం పంపామని, ఆ బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం గవర్నర్ పంపి యేళ్లు గడుస్తున్నా కేంద్రప్రభుత్వం ఆమోదించడం లేదని ఆరోపించారు.

వెలుగు చూసిన అక్రమాలు...

ఇటీవల నీట్ నిర్వహణలో వెలుగు చూసిన అవినీతి అక్రమాలు విద్యార్థి లోకాన్నే కాకుండా యావద్దేశాన్నే ఆందోళనపరచిందన్నారు. మునుపెన్నడూ లేనట్లు ఆ పరీక్షలకు హాజరైనవారిలో వందల సంఖ్యలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులు కావటం ప్రశ్నపత్రాలు హాట్‌కేకుల్లా బహిరంగ ప్రదేశాల్లో విక్రయించడం వంటి అక్రమాలు ఉత్తరాది రాష్ట్రాల్లో జరిగాయని తెలిపారు. అంతేకాకుండా పరీక్షలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయనే సాకుతో చాలా మందికి గ్రేస్ మార్కులు కూడా ఇచ్చారని, ఆ నిర్ణయాన్ని దేశమంతటా వ్యతిరేకించడంతో వాటిని రద్దు చేసి, వారికి మళ్ళీ పరీక్షలు జరిపారని స్టాలిన్ చెప్పారు. పలు పరీక్షా కేంద్రాల వద్ద పరీక్షలు ప్రారంభం కాకమునుపే ప్రశ్నపత్రాలు విద్యార్థుల చేతుల్లోకి వచ్చాయన్నారు. పరీక్షా కేంద్రాలలో తనిఖీ అధికారులుగా ఉన్నవారే ప్రశ్నపత్రాలకు సమాధానాలు రాసిన దారుణమైన సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయని తెలిపారు. ఈ సంఘటనలు లక్షలాది రూపాయలు వెచ్చించి శిక్షణ పొంది పరీక్షలు రాసిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించాయన్నారు. ఇంతటి అవినీతి, అక్రమాలు జరిగిన పరీక్షలు సక్రమంగానే జరిగాయంటూ డంబాలు పలికిన కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా మందలించిందన్నారు. ఇలాంటి అవకతవకలకు తావుంటుందనే యేళ్ల తరబడి రాష్ట్ర ప్రజలు నీట్‌కు వ్యతిరేకంగా సుదీర్ఘ పోరాటాలు జరుపుతూ వచ్చారని, ప్రస్తుతం ఈ ఆందోళనకు పలు రాష్ట్రాలు మద్దతునిచ్చేందుకు సిద్ధమవుతున్నాయన్నారు.

రాష్ట్రప్రభుత్వాలే నిర్వహించేలా...

వైద్య కోర్సులకు మునుపటిలాగే రాష్ట్ర ప్రభుత్వాలే జరుపుకునేందుకు అనుమతించాలని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రధానికి లేఖ రాశారని, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్, బిహార్ రాష్ట్ర ప్రధాన ప్రతిపక్ష నేత తేజస్విని యాదవ్ ప్రస్తుతం నీట్ పరీక్ష రద్దుకు గట్టి మద్దతునిస్తున్నారని ఆయన వివరించారు. తాజా పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని నీట్‌ను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం ప్రతిపాదిస్తున్నట్లు సభ్యుల హర్షధ్వానాల నడుమ స్టాలిన్ ప్రకటించారు. అంతే కాకుండా ఇదివరకే నీట్ నుంచి మినహాయింపు కల్పించాలని శాసనసభలో ఆమోదించి పంపిన ముసాయిదా చట్టానికి కేంద్రం వెంటనే ఆమోదం తెలపాలని కూడా ఆ తీర్మానంలో పేర్కొన్నారు. నీట్‌ను పలు రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తుండడంతో దాన్ని రద్దు చేయడానికి అవసరమైన చట్టపరమైన చర్యలను కేంద్రం చేపట్టాలని కూడా తీర్మానంలో విజ్ఞప్తి చేశారు.

తమిళుల కీర్తిని కించపరచడమే

● సెంగోల్‌ను తొలగించమని చెప్పడంపై కేంద్రమంత్రి మురుగన్



చెన్నై, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తమిళుల కీర్తి ప్రతిష్ఠలకు చిహ్నమైన సెంగోల్‌ను పార్లమెంట్ నుంచి తొలించాలని రాష్ట్రానికి చెందిన ఎంపీలు డిమాండ్ చేయడం గర్హనీయమని కేంద్రమంత్రి ఎల్.మురుగన్ ధ్వజమెత్తారు. దేశానికి స్వాతంత్ర్యం లభించిన వేళ అధికార మార్పిడికి చిహ్నంగా ఉపయోగించిన సెంగోల్‌ను ప్రధాని మోదీ కొత్త పార్లమెంట్‌లో ప్రతిష్ఠించారని. ఈ పరిస్థితుల్లో సెంగోల్ రాచరికానికి గుర్తు అంటూ సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ఎంపీ లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాస్తే, ఆ నిర్ణయాన్ని స్వాగతిస్తూ రాష్ట్రానికి చెందిన ఎంపీ మాణిక్కం ఠాగూర్, డీఎంకే సీనియర్ నేత టీకేఎస్ ఇళంగోవన్ సహా ఇండియా కూటమిలోని పలువురు ఎంపీలు, నేతలు ప్రకటనలు జారీ చేయడం తమిళుల ప్రాచీన కీర్తి ప్రతిష్ఠలను అవమానపరచడమేనని ఆయన విమర్శించారు. రాష్ట్రానికి చెందిన మఠాధిపతుల సమక్షంలో పార్లమెంట్‌లో సెంగోల్‌ను ప్రతిష్ఠించి ప్రధాని మోదీ తమిళుల కీర్తిని ప్రపంచ దేశాలన్నింటికీ తెలియజేశారన్నారు. ప్రస్తుతం ఆ సెంగోల్‌ను తొలగించమంటూ ఇండియా కూటమిలోని ఎంపీలు, నేతలు డిమాండ్ చేయడం భావ్యమేనా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న డీఎంకే సభ్యులకు కూడా సెంగోల్ విశిష్టతలను కించపరిచేలా విమర్శించడం తమిళ ప్రజానీకాన్ని అవమానించడమే అవుతుందని ఆయన తెలిపారు.

రౌడీపై పోలీసుల కాల్పులు

మోకాలిలోకి దూసుకెళ్లిన బుల్లెట్ ● మరో ఇద్దరు రౌడీల అరెస్టు

● చెంగల్పట్టులో ఘటన



గాయపడిన సత్య

అడయార్, జూన్ 28: చెంగల్పట్టులో రౌడీలకు, పోలీసులకు మధ్య కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో కిరాయి ముఠా రౌడీ నేత మోకాలిపై పోలీసులు కాల్పులు జరపడంతో కుప్పకూలిపోయాడు. దీంతో అతనితో పాటు మరో ఇద్దరు అనుచరులను పోలీసులు అరెస్టు చేశారు. తుపాకీ కాల్పుల్లో గాయపడిన రౌడీకి స్థానిక చెంగల్పట్టు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం వేకువజామున జరిగిన ఈ తుపాకీ కాల్పుల ఘటనను పరిశీలిస్తే... మైలాడుదురై జిల్లా సీర్గాళికి చెందిన పేరు మోసిన రౌడీ సత్య (40). ఈయనపై హత్య, హత్యాయత్నం, దోపిడీ ఇలా దాదాపు 24కు పైగా కేసులున్నాయి. అయితే, పోలీసులకు చిక్కకుండా అజ్ఞాతంలో ఉంటూ తన కార్యకలాపాలను కొనసాగిస్తున్నాడు. సత్య ప్రాణస్నేహితుడు సురేష్ (43) చెంగల్పట్టు జిల్లా పొన్‌విలైంద కనత్తూరులో ప్రముఖ రౌడీగా చెలామణి అవుతున్నాడు. ఈయనపై కూడా పదికిపైగా కేసులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తన స్నేహితుడిని చూసేందుకు సత్య ఇటీవల కారులో చెంగల్పట్టుకు వచ్చినట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున పళవెలి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో లగ్జరీ కారు అమితవేగంతో పోలీసులపైకి దూసుకొచ్చింది. ఈ ప్రమాదం నుంచి తప్పించుకున్న పోలీసులు.. ఆ కారును వెంబడించారు. ఈ క్రమంలో పోలీసులను లక్ష్యంగా చేసుకుని రౌడీలు తుపాకీ కాల్పులు జరిపారు. దీంతో పోలీసులు ఎదురు కాల్పులు జరపడంతో రౌడీ సత్యతోపాటు మరో ఇద్దరు రౌడీలు గాయపడ్డారు. దీంతో వారందరినీ అరెస్టు చేశారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో ఓ బుల్లెట్ సత్య మోకాలిలోకి దూసుకెళ్ళింది. దీంతో తీవ్ర రక్తస్రావం కావడంతో సత్యను చెంగల్పట్టు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ఆపరేషన్ ద్వారా బుల్లెట్‌ను తొలగించి చికిత్స అందిస్తున్నారు. మరో ఇద్దరు రౌడీలు పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని పారిపోయినట్టు సమాచారం. కాగా, రౌడీ సత్య చికిత్స పొందుతున్న ఆస్పత్రి వద్ద భారీ సంఖ్యలో పోలీసులను మోహరించారు. అలాగే పోలీసు ఉన్నతాధికారులు కూడా ఆస్పత్రితో పాటు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

పరోక్షంగా రాజకీయాల్లో పాల్గొనండి

వక్రమార్గంలో ప్రయాణించొద్దు ● విద్యార్థులకు హీరో విజయ్ హితవు



ప్రసంగిస్తున్న విజయ్

అడయార్, జూన్ 28: విద్యార్థులకు తమిళగ వెట్రి కళగం అధినేత, ప్రముఖ నటుడు విజయ్ హిత వచనాలు పలికారు. ఒకవైపు విద్యాభ్యాసం చేస్తూనే మరోవైపు పరోక్షంగా రాజకీయాల్లో పాల్గొనవచ్చని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు వక్రమార్గంలో ప్రయాణించవద్దని కోరారు. ఈ యేడాది పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన 10, 12 తరగతుల విద్యార్థులను ఆయన అభినందించారు. రాష్ట్రస్థాయిలో ప్రతి నియోజకవర్గం వారీగా మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఆయన స్థాపించిన రాజకీయ పార్టీ తమిళగ వెట్రి



విద్యార్థులతో విజయ్

కళగం తరపున విద్యా ప్రోత్సాహక పురస్కార ప్రదానోత్సవం శుక్రవారం స్థానిక నీలాంగరైలోని శ్రీరామచంద్ర కల్యాణ మండపంలో జరిగింది. ఇందులో విజయ్ పాల్గొని ప్రతి ఒక్క విద్యార్థికి శాలువా కప్పి అభినందించి, విద్యా పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి దాదాపు 800 మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ప్లస్‌టూ పరీక్షల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన కొళత్తూరుకు చెందిన ఎస్.ప్రకాష్, తిరుపూరు జిల్లా పల్లడం నియోజకవర్గానికి చెందిన ఇ.మహాలక్ష్మి, చెంగల్పట్టు జిల్లా తాంబరం నియోజకవర్గానికి చెందిన తోషితా లక్ష్మిని ఆయన ప్రత్యేంగా అభినందించి, విద్యా కానుకలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తొలుత 21 జిల్లాలకు చెందిన విద్యార్థులను ఆహ్వానించగా, మిగిలిన 19 జిల్లాలకు చెందిన విద్యార్థులను జులై 3న ఆహ్వానించి విద్యా ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేయనున్నారు.

సోషల్ మీడియా ప్రభావం..

ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి హీరో విజయ్ మాట్లాడుతూ, విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తూనే పరోక్షంగా రాజకీయాల్లో పాల్గొనవచ్చన్నారు. ఇపుడు సోషల్ మీడియా ప్రభావం పెరిగిపోయిందన్నారు. అందుకే మంచిది చెడుగాను, చెడు మంచిగా ప్రచారం చేస్తున్నారన్నారు. ఇలాంటివన్నీ చూసి ఏది మంచి, ఏది చెడు అనే విషయాలను ప్రతి ఒక్కరూ బేరీజు వేసుకుని, మంచిని మాత్రమే గ్రహించాలని పిలుపునిచ్చారు. అపుడే దేశంలో ఎలాంటి సమస్యలున్నాయి, ప్రజలు ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు, సంఘ విద్రోహశక్తులు ఎవరన్న విషయాలు తెలుసుకోవచ్చన్నారు. ఈ విషయాలను గ్రహిస్తే ఒక రాజకీయ పార్టీ చేసే తప్పుడు ప్రచారాన్ని గుడ్డిగా నమ్మకుండా ఏది నిజం, ఏది చెడో గ్రహించి, ఒక మంచి రాజకీయ నేతను ఎన్నుకునే విశాల భావాలతో దూరదృష్టిని పెంపొందించుకోవచ్చన్నారు. సమాజంలో మాదకద్రవ్య వినియోగం పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేసిన విజయ్.. ఇలాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అలాగే, ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల తర్వాత మంచి స్నేహితులను ఎంపిక చేసుకోవాలని, తప్పుడు లేదా వక్రమార్గంలో మాత్రం ప్రయాణించవద్దని విజయ్ పిలుపునిచ్చారు.

రాష్ట్ర భవిష్యత్తు విద్యార్థులే...

రాష్ట్ర భవిష్యత్తు విద్యార్థినీ విద్యార్థులేనని అన్నారు. ప్రతి రంగం మంచిదేనని, ఏది ఎంచుకుంటారో దానిపై పూర్తిస్థాయిలో దృష్టిసారించి పట్టుదలతో కృషి చేస్తే విజయం తథ్యమన్నారు. అందువల్ల ఉన్నత చదువుల్లో విద్యార్థులకు నచ్చిన సబ్జెక్టును ఎంచుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన వైద్యులు, ఇంజనీర్లు ఉన్నారన్నారు. అయితే, రాష్ట్రానికి ఇప్పటికైతే మంచి నాయకులు కావాలన్నారు. కేవలం రాజకీయ పరంగానే కాకుండా, శాఖలపరంగా కూడా మంచి నేతలు కావాలన్నారు. ఒక విభాగాన్ని ఎంచుకునే సమయంలోనే రాజకీయాలను కూడా ఎంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

విజయ్ పార్టీతోనే పొత్తుపెట్టుకుంటా: సీమాన్

చెన్నై: రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో తన చిరకాల మిత్రుడు, సినీనటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)తోనే పొత్తుపెట్టుకుంటానని నామ్ తమిళర్ కట్చి (ఎన్టీకే) సమన్వయకర్త సీమాన్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలో ఏర్పాటైన కార్యక్రమంలో 234 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన పబ్లిక్ పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆర్థిక సహాయాలు, విద్యా ఉపకరణాల పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ మేరకు తన ఎక్స్ పేజీలో ఇప్పటి వరకూ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోని తమ పార్టీ భవిష్యత్తులో అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పార్టీతోనే తప్పకుండా పొత్తుకుదుర్చుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

టార్గెట్‌తోనే మద్యం విక్రయాలు

● డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత




గవర్నర్ ఆర్ఎన్ రవికి వినతిపత్రం సమర్పిస్తున్న డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత, ఆ పార్టీ నేతలు

ప్యారీస్, జూన్ 28: ప్రజల ప్రాణాలు పణంగా పెట్టి టార్గెట్‌తోనే డీఎంకే ప్రభుత్వం రాష్ట్రంలో మద్యపానీయాలు విక్రయిస్తోందని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజయకాంత్ వ్యాఖ్యానించారు. కళ్లకుర్చి కల్తీ సారా దుర్ఘటనపై సీబీఐ విచారణకు ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ గవర్నర్ ఆర్ఎన్ రవికి శుక్రవారం ప్రేమలత వినతి పత్రం సమర్పించారు. స్థానిక గిండిలోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను సంప్రదించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీల్లో ఒకటైన టాస్మాక్ దుకాణాలను దశలవారీగా మూసివేస్తామన్న హామీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం అమలు పరచలేదని గుర్తు చేశారు. అధికార పార్టీకి చెందిన వారే మద్యం తయారీ ఫ్యాక్టరీలు నడుపుతున్నారని, పాలకులు ప్రజల ప్రాణాలు పణంగా పెట్టి సంపాదనే లక్ష్యంగా టాస్మాక్ మద్యం దుకాణాలను నడుపుతున్నారన్నారు. ఇంతకంటే అమానవీయం ఏదీలేదన్నారు. కల్తీ సారా వ్యవహారంపై సీబీసీఐడీ పోలీసులు జరిపే విచారణ వల్ల వాస్తవాలు వెలుగులోకి రావని, అందువల్ల దీనిపై సీబీఐ విచారణ జరపాలన్నారు. రాష్ట్ర మంత్రి ఎస్.ముత్తుస్వామిని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మరోవైపు అధికారుల సహకారంతోనే రాష్ట్రవ్యాప్తంగా సారా, మాదకద్రవ్యాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయని ధ్వజమెత్తారు. ప్రజల సమస్యలకు సంబంధించిన ఆరు అంశాల వినతిపత్రాన్ని గవర్నర్‌కు సమర్పించామని, వీటిని పరిశీలించి చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారన్నారు. సారా తాగి మృతిచెందిన వారికి ప్రభుత్వం తరఫున రూ.10 లక్షలు పరిహారం పంపిణీ చేయడం తప్పుడు ఉదాహరణేనని, ఇలా చేయడం వల్ల కల్తీ సారాకు మరికొందరు మరణించే అవకాశముంటుందని ప్రేమలత తెలిపారు.

రాష్ట్రంలో తిరువణ్ణామలై సహా 4 కొత్త కార్పొరేషన్లు

అసెంబ్లీలో ప్రత్యేక బిల్లు దాఖలు



తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయం

చెన్నై, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో నాలుగు కొత్త కార్పొరేషన్లకు బీజం పడింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 48.45 శాతం మంది నగర ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ప్రస్తుతం నగర ప్రాంతాల్లో నివసించే వారు 53 శాతం దాకా ఉన్నారు. రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా 28 మున్సిపాలిటీలు, తాంబరం, కాంచీపురం, కడలూరు, కుంభకోణం, కరూరు, శివకాశి కార్పొరేషన్లు ఏర్పాటయ్యాయి. ఈ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేసి ప్రజలకు కనీస సదుపాయాలను మెరుగు పరచింది. ఈ నేపథ్యంలో చారిత్రక నగరంగా పేరుగడించిన పుదుకోట, ఆలయ నగరంగా కీర్తిగడిస్తున్న తిరువణ్ణామలై, పారిశ్రామిక నగరంగా అభివృద్ధి చెందుతున్న నామక్కల్, విద్యానగరంగా ఉన్న కారైక్కుడిని కార్పొరేషన్లుగా స్థాయిని పెంచుతూ శాసనసభలో ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టారు. నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ శుక్రవారం ఈ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ మేరకు పుదుకోట మున్సిపాలిటీలో 11 పంచాయతీలను కలిపి పుదుకోట కార్పొరేషన్, తిరువణ్ణామలై మున్సిపాలిటీలో 18 పంచాయతీలను విలీనం చేసి దిగువ అన్నామలై ఉన్న కొన్ని ప్రాంతాలను కూడా కలుపుకుని తిరువణ్ణామలై కార్పొరేషన్ ఏర్పాటవుతుంది. ఇదే విధంగా నామక్కల్ మున్సిపాలిటీలో 12 పంచాయతీలను కలిపి నామక్కల్ కార్పొరేషన్, కారైక్కుడి మున్సిపాలిటీలో రెండు నగర పంచాయతీలు, ఐదు పంచాయతీలను విలీనం చేసి కారైక్కుడి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రతిపాదనకు సంబంధించిన బిల్లును శనివారం జరిగే శాసనసభలో ఆమోదించనున్నారు.

సమాచార దర్శిని

టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూన్ 28: చెన్నై జిల్లా ఆదిద్రావిడుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పీజీ టీచర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. స్థానిక కన్నికాపురం ఆది ద్రావిడుల మహోన్నత పాఠశాలలో నాలుగు, బాలికల పాఠశాలలో కెమిస్ట్రీ టీచర్, మీనంబాక్కం పాఠశాలలో తమిళ టీచర్ పోస్టులకు చెన్నై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నేరుగా కానీ, రిజిస్టర్ పోస్టు ద్వారా జూలై 5వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రకటన బ్యానర్లకు అనుమతి

ఐసిఎఫ్, జూన్ 28: చెన్నై నగరంలో ప్రకటన బ్యానర్లను ఏర్పాటు చేసుకోవడానికి కార్పొరేషన్ అనుమతిచ్చేందుకు నిర్ణయించింది. కార్పొరేషన్ పరిధిలోని ప్రాంతాల్లో 2,500కు పైగా ప్రకటన బోర్డులు, బ్యానర్లకు అనుమతి నిషేధించారు. వీటిని తొలగించాలని కార్పొరేషన్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినా మండల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రమాదాలకు కారణమైన వాటిని తొలగించాలని వివిధ వర్గాల వారు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో, కార్పొరేషన్ పరిధిలో 220 ప్రకటన బ్యానర్లు, బోర్డులకు అనుమతించేందుకు కార్పొరేషన్ నిర్ణయించింది. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ... నగరంలోని పలు చోట్ల ఇదివరకే ప్రకటన బోర్డులు ఏర్పాటుచేసిన యజమానులు కోర్టును ఆశ్రయించారని, భద్రతా అంశాలున్న బ్యానర్లకు అనుమతివ్వాల్సిందిగా కోర్టు సిఫారసు చేసిందని తెలిపారు.ఆ ప్రకారం,జూలై మొదటి వారంలో 220 ప్రకటనబోర్డులకు అనుమతి ఇవ్వనున్నామని తెలిపారు.

మధురాంతకంలో రూ.22 కోట్లతో సబ్‌వే

ఐసిఎఫ్, జూన్ 28: చెంగల్పట్టు జిల్లా మధురాంతకంలో ప్రమాదాలను అడ్డుకొనేలా రూ.22 కోట్లతో సబ్‌వే నిర్మించనున్నారు. మధురాంతకం సమీపంలో మోచ్చేరి కరుణాకర విలాగం, అరుంధతి పాళయం, పుదూర్ సహా 10కి పైగా గ్రామాలకు చెందిన వారు ప్రమాదకర రీతిలో రోడ్డు దాటుతున్నారు. హైవేలో అతివేగంతో వెళ్లే వాహనాల కారణంగా ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. 20 ఏళ్లలో 200మందికి పైగా మృతి చెందగా, వేలాది మంది గాయపడ్డారు.రెండునెలల క్రితం జరిగిన ప్రమాదంలో 12 మంది మృతి చెందారు. ఈ ప్రాంతంలో ప్రమాదాలను అడ్డుకొనేలా జాతీయ రహదారుల కమిషన్ చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు వివిధ రూపాల్లో పోరాటాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో, మధురాంతకం సెంగుందల్‌పేట - మోచ్చేరి మధ్య రూ.22.39 కోట్లతో సొరంగమార్గాన్ని నిర్మించేందుకు జాతీయ రహదారుల కమిషన్ చర్యలు చేపట్టింది. కార్లు, ద్విచక్రవాహనాలు వెళ్లేలా సబ్‌వే నిర్మిస్తున్నారు. టెండర్లు ఖరారు కాగానే పనులు ప్రారంభించి ఏడాదిలోపు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

50 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

ఐసిఎఫ్, జూన్ 28: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 50 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆహార శాఖ మంత్రి చక్రపాణి తెలిపారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ... తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం, మైలాడుదురై, మదురై, దిండుగల్, రామనాథపురం, తెన్‌కాశి, తేని, కడలూరు, తిరువణ్ణామలై, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూర్ జిల్లాల్లో ఉపాధి హామీ పథకం కింద 50 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఒక్కొక్కటి రూ.30 లక్షలతో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

కారైక్కాల్ - బెంగళూరు రైళ్లకు అదనపు బోగీలు

ఐసిఎఫ్, జూన్ 28: కర్ణాటక రాష్ట్రం యశ్వంత్‌పూర్ - సేలం, బెంగళూరు - కారైక్కాల్ మధ్య నడిచే అన్‌రిజర్వుడు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా సెకండ్ క్లాస్ బోగీలు అనుసంధానం చేయనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. యశ్వంతపూర్ నుంచి సేలంకు వచ్చే అన్‌రిజర్వుడు ఎక్స్‌ప్రెస్ రైలు జూలై 4వ తేది నుంచి, సేలం నుంచి యశ్వంత్‌పూర్‌కు వెళ్లే ఎక్స్‌ప్రెస్ జూలై 5నుంచి అదనపు బోగీలతో నడవనున్నాయి. బెంగళూరు నుంచి కారైక్కాల్‌కు వచ్చే ఎక్స్‌ప్రెస్ రైలు జూలై 6, కారైక్కాల్ నుంచి బెంగళూరు వచ్చే ఎక్స్‌ప్రెస్‌కు జూలై 7వ తేది నుంచి అదనపు బోగీలు అనుసంధానం చేయనున్నారు.

వృత్తివిద్యా కోర్సులకు అనుమతి అవసరం లేదు

ఐసిఎఫ్, జూన్ 29: వృత్తివిద్య కోర్సులు నిర్వహించేందుకు ప్రత్యేక అనుమతి పొందనవసరం లేదని ఏఐసీటీఈ తెలిపింది. ఈ మేరకు అఖిల భారత సాంకేతిక విద్య కౌన్సిల్ విడుదల చేసిన ప్రకటనలో... కౌన్సిల్‌లో పనిచేసే నిపుణులకు సంబంధించిన కోర్సులకు ఏఐసీటీఈ అంగీకారం ఇస్తుందని, ఇప్పటివరకు 414 విద్యా సంస్థలు ఈ అనుమతి పొందాయని పేర్కొంది. వీటి ద్వారా 37,845 మంది విద్యార్థులు ఈ కోర్సులు పూర్తి చేశారని పేర్కొంది. ప్రస్తుతం ఇలాంటి వృత్తి విద్య కోర్సులకు ఆయా విశ్వవిద్యాలయాల అనుమతి చాలని, ఏఐసీటీఈ అనుమతి అవసరం లేదని కౌన్సిల్ కార్యదర్శి రాజీవ్‌కుమార్ తెలిపారు.

సౌదీలో డాక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూన్ 28: సౌదీ అరేబియాలోని ఆసుపత్రుల్లో వైద్య పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర విదేశీ ఉద్యోగ అవకాశాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మహేశ్వరన్ తెలిపారు. కన్సల్టెంట్, స్పెషలిస్ట్ అల్లోపతి వైద్యులు అవసరమవుతున్నారని, ఈ పోస్టులకు 45 ఏళ్లలోపు పీజీ వైద్యులు రెండేళ్ల అనుభవ సర్టిఫికేట్‌తో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. తమ సంస్థకు మధ్యవర్తులు, ఏజెంట్లు లేరని, ఎవరిని నమ్మి మోసపోవద్దని తెలిపారు. వివరాలకు నెం.9566239685, 6379179200 వాట్సాప్ నెంబర్లు, 044-22505886లో సంప్రదించవచ్చని తెలిపారు.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

ఐసిఎఫ్, జూన్ 28: నెమ్మేలిలో చేపడుతున్న పర్యవేక్షణ పనుల కారణంగా మూడు మండలాల్లో ఈ నెల 30వతేది తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెన్నై మెట్రోవాటర్ బోర్డు అధికారులు తెలిపారు. నెమ్మేలి నిర్లవణీకరణ కేంద్రంలో ప్రధాన పైప్ లైన్ మరమ్మతులు జరగనుండడంతో అడయార్ మండల పరిధిలోని తిరువాన్మియూర్, పల్లిపట్టు, కోట్టూరు గార్డెన్, ఆర్కే మఠం వీధి, ఇందిరా నగర్ ఓహెచ్‌డీ, పెరుంగుడి మండల పరిధిలోని కొట్టివాక్కం, పాలవాక్కం, పెరుంగుడి, పళ్లికరనై, మడిపాక్కం, షోళింగనల్లూర్ మండల పరిధిలోని ఇంజంబాక్కం, నీలాంగరై, అక్కరై, ఎళిల్ నగర్, కన్నగి నగర్, కారపాక్కం,వెట్టువాంబేణి, షోళింగనల్లూరు, ఒక్కియం - తురైపాక్కం ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9 నుంచి జూలై 1వతేది ఉదయం 9గంటలవరకు తాగునీటి సరఫరా నిలిపివేసి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయనున్నారు. అత్యవసర సేవలకు నెం.044-45674567లో, వాటర్‌బోర్డు వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

75,000 రైలు బోగీల తయారీ

● ఐసిఎఫ్ రికార్డు



నూతన బోగీ వద్ద సీఎఫ్ జనరల్ మేనేజర్ యు.సుబ్బారావు, ఇతర సిబ్బంది

ప్యారీస్, జూన్ 28: స్థానిక పెరంబూర్ నియోజకవర్గ పరిధిలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసిఎఫ్)లో 75 వేల రైలు బోగీలు తయారుచేసి రికార్డు సృష్టించింది. రైలు బోగీలు డిజైన్ చేయడంలో, తయారీలో ప్రసిద్ధి చెందిన ఐసిఎఫ్‌ను 1955 ఆగస్టు 2న ప్రారంభించారు. ఆరంభ దశలో రైళ్లకు అవసరమైన విడిభాగాలు పొందుపరిచే కర్మాగారంగా పనిచేసిన ఐసిఎఫ్, ఆ తర్వాత దశల వారీగా అభివృద్ధి చెందింది. ఇక్కడ తయారవుతున్న రైలు బోగీలు భారత రైల్వే శాఖ మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ప్రయాణికుల అవసరాలు, కాలానుగుణంగా అత్యాధునిక వసతులతో రైళ్లు, రైలు బోగీలు, విహారయాత్రకు సంబంధించిన బోగీలు సహా 50 రకాలకు పైగా 600 డిజైన్ల ఐసిఎఫ్‌లో బోగీలు తయారవుతున్నాయి. ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకొని ఇటీవల వందేభారత్ సూపర్‌ఫాస్ట్ రైళ్లను ఇప్పటివరకు 60కి పైగా తయారుచేసింది. ఈ నేపథ్యంలో, ఆదివారం 68వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా రైలు బోగీల తయారీలో సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఇప్పటివరకు 75,017 రైలు పెట్టెలు తయారుకాగా, అధిక సంఖ్యలో 31,349 ఆర్డినరీ బోగీలు, 8,152 ఎల్‌హెచ్‌బీ బోగీలు, 6,895 ఎల్‌హెచ్‌బీ ఏసీ బోగీలు, 752 వందే భారత్ చైర్‌కార్ బోగీలు ఇక్కడ తయారయ్యాయి. ఇవికాకుండా, విదేశాలకు 875 రైలు బోగీలు ఎగుమతి అయినట్లు అధికారులు తెలిపారు.

హౌసింగ్ బోర్డు పాత గృహాలకు సొబగులు

● అసెంబ్లీలో స్టాలిన్ ప్రకటన

చెన్నై, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నగర శివారు నివాసాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని పాత గృహ సముదాయాలను మరమ్మతులు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం శాసనసభలో 110 సభా నిబంధన కింద ఈ మేరకు ప్రకటన జారీ చేస్తూ... రాష్ట్రవ్యాప్తంగా గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో లక్షా 93 వేలకు పైగా పలు అంతస్తుల భవనాల గృహసముదాయాలు ఉన్నాయని, వాటిలో 28,643 ఇళ్లు శిథిలావస్థలకు చేరుకున్నట్టు అధికారులు గుర్తించారన్నారు. వాటికి మరమ్మతులు చేపట్టి మరిన్ని కొత్త సదుపాయాలు కల్పిస్తామని ఆయన తెలిపారు. తొలివిడతగా 2024-25 సంవత్సరంలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలో ఈస్ట్ సిమెట్రీ రోడ్డు, కొడుంగయూరు, వావుసి నగర్ క్వార్టర్స్ వద్ద, తంజావూరు ఏపీపతి నగర్ ప్రాజెక్టు ప్రాంతం, తిరుచ్చి కోట్టకొల్లై ప్రాజెక్టు ప్రాంతంలో ఉన్న 6,746 నివాసగృహాలను మరమ్మతులు చేయనున్నామన్నారు. పనులు పూర్తయ్యేంతవరకూ ఆ ఇళ్లలో నివసిస్తున్నవారికి ప్రత్యామ్నాయ ప్రాంతాల్లో నివాస సదుపాయం కూడా కల్పిస్తామని స్టాలిన్ వివరించారు.

డెల్టా రైతులకు పరిహారం పంపిణీ చేయాలి

● అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, జూన్ 28: కురువై సాగుకు ఈనెల 12వ తేదీన సాగునీటిని విడుదల చేయకపోవడం కారణంగా నష్టపోయిన డెల్టా రైతులకు రాష్ట్రప్రభుత్వం పరిహారం పంపిణీ చేయాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో... డెల్టా జిల్లాల్లో ప్రధాన వృత్తిగా ఉన్న వ్యవసాయానికి గత ఏడాది కురువై సీజన్‌లో మేట్టూరు డ్యాం నుంచి సక్రమంగా నీటిని విడుదల చేయకపోవడంవల్ల ఎన్నో వ్యయప్రయాసలతో సాగు చేసిన పంటలు ఎండిపోయాయని, కురువై సాగుకు పంట బీమా సౌకర్యం లేనందువల్ల రైతులు తగిన నష్టపరిహారం పొందలేకపోయారని తెలిపారు. విపత్తుల నివారణంగా హెక్టారుకు రూ.17,000 చొప్పున రైతులకు కేంద్రప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని కూడా డీఎంకే ప్రభుత్వం పూర్తిస్థాయిలో కాకుండా రూ.13,500 మాత్రమే పంపిణీ చేసి మోసం చేసిందని ఆరోపించారు. ఈ ఏడాది జూన్ 12న డెల్టా జిల్లాల్లో కురువై సాగుకు మేట్టూరు డ్యాం నీటిని విడుదల చేయకపోవడంపై రాష్ట్రప్రభుత్వం స్పందించలేదని తెలిపారు. ఈ సంవత్సరం సాగునీరు లేక కురువై సాగు చేయలేని ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ భూములకు ఎకరాకు రూ.30,000 పరిహారం ప్రకటించాలని, డెల్టా రైతుల కుటుంబాలకు రేషన్ కార్డుకు నెలకు రూ.5,000 పంపిణీ చేయాలని కోరారు. సీజన్‌లో సాగునీటిని విడుదల చేయకపోవడం వల్ల నష్టపోయిన రైతులను ఆదుకొనేలా గత అన్నాడీఎంకే ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో పాటు రాష్ట్రప్రభుత్వం తరఫున కూడా అవసరమైన నిధులు పంపిణీ చేయడంతో పాటు రైతులకు సహకరిస్తున్న ఎద్దుల పెంపకం, మేత కూడా ఉచితంగా పంపిణీ చేశామని, ఈ విధంగానే డీఎంకే ప్రభుత్వం కూడా ప్రకటించాలని ఎడప్పాడి కోరారు.

పెట్టుబడుల కోసం త్వరలో స్టాలిన్ అమెరికా పయనం

చెన్నై, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విదేశీ పారిశ్రామిక పెట్టుబడులను సమీకరించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ త్వరలో అమెరికాకు పయనమవుతారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా తెలిపారు. ఈ మేరకు శాసనసభలో తన శాఖకు సంబంధించిన ఆర్థిక పద్దులపై మాట్లాడుతూ... చెన్నైలో నిర్వహించిన అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సులో ప్రభుత్వం వివిధ విదేశీ సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం 60 శాతం పెట్టుబడులతో పరిశ్రమలు ప్రారంభమయ్యాయని ఆయన చెప్పారు.

నిర్మాణ పనుల పరిశీలన



పేర్నాంబట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, జూన్ 28: జిల్లాలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను శుక్రవారం కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. గుడియాత్తం పంచాయతీ పరిధిలోని కౌండిన్య నదిపై నాబార్డు నిధులు రూ.2.29 కోట్లతో చేపట్టిన వంతెన నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. తర్వాత పేర్నాంబట్టు మున్సిపాలిటీలో ప్రధానమంత్రి ప్రజల అభివృద్ధి పథకం కింద రూ.1.09 కోట్లతో చేపట్టిన నగర ప్రాంత ప్రారంభ ఆరోగ్య కేంద్ర నిర్మాణాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట గుడియాత్తం రెవెన్యూ తహసీల్దార్ సుబ్బలక్ష్మి, పేర్నాంబట్టు నగర పంచాయతీ ఉపాధ్యక్షుడు అలియాసు సుబేదార్, జిల్లా ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి సీత, శుభ్రతా పనుల అసిస్టెంట్ డైరెక్టర్ భానుమతి తదితరులున్నారు.

వైద్యశాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు

● మంత్రి ఎం.సుబ్రమణ్యం



కరుణ సమాధి వద్ద అంజలి ఘటిస్తున్న మంత్రి సుబ్రమణ్యం

ప్యారీస్, జూన్ 28: రాష్ట్ర ఆరోగ్యశాఖలో 21 విభాగాల్లో ఖాళీగా ఉన్న 3,645 పోస్టులను భర్తీ చేసేలా డిసెంబరులోగా రాతపరీక్షలు నిర్వహించనున్నట్లు ఆ శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం ప్రకటించారు. శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి ఆరోగ్యశాఖకు సంబంధించిన బిల్లును దాఖలు చేసి అందులవివరాలను సభకు వివరించారు. అసిస్టెంట్ డాక్టర్ (జనరల్) విభాగంలో 2,553 పోస్టులు, అసిస్టెంట్ వైద్యశాఖ అధికారి (సిద్ధ) విభాగంలో ఉన్న 26 పోస్టులు, వైద్యుల పోస్టులు 425, గ్రామ ఆరోగ్య శాఖ నర్సుల విభాగంలో 367 పోస్టులు, నేత్ర వైద్య విభాగంలో 100 సహాయకుల పోస్టులు, సిద్ధ విభాగంలో 49 ఫార్మసీ పోస్టుల భర్తీకి రాష్ట్రప్రభుత్వం అనుమతులు జారీ చేసిందని తెలిపారు. డిసెంబరులోగా రాతపరీక్షలు నిర్వహిస్తామని, ఈ పరీక్షలన్నీ తమిళంలోనే ఉంటాయన్నారు. పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేలా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డు తరఫున చర్యలు చేపట్టినట్లు మంత్రి వివరించారు. కాగా అసెంబ్లీకి వెళ్లే ముందు మంత్రి సుబ్రమణ్యం దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి సమాధి వద్దకెళ్లి అంజలి ఘటించారు.

కల్తీ సారాపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి

● బీజేపీ నేత హెచ్.రాజా



సమావేశంలో ప్రసంగిస్తున్న హెచ్.రాజా

వేలూరు, జూన్ 28: కళ్లకుర్చి కల్తీ సారా వ్యవహారంలో ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందని బీజేపీ నేత హెచ్.రాజా విమర్శించారు. బీజేపీ కార్యాయంలో శుక్రవారం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుల సమావేశం జాతీయ మాజీ సెక్రటరీ హెచ్.రాజా అధ్యక్షతన జరుగగా, జిల్లా అధ్యక్షుడు మనోహరన్, రాష్ట్ర సెక్రటరీ వెంకటేశన్, జిల్లా సెక్రటరీ ఇళంగోవన్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం రాజా మాట్లాడుతూ... కళ్లకుర్చి ఘటనలో 65 మంది మృతి చెందడం బాధాకరమన్నారు. సారా విక్రయాల్లో అధికార పార్టీ నేతలకు సంబంధాలున్నాయన్నారు. ఈ వ్యవహారంపై సీబీసీఐడీ విచారణలో వాస్తవాలు వెలుగుచూసే అవకాశం లేదని, అందువల్ల సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై అసెంబ్లీలో ప్రస్తావించాలన్న ప్రతిపక్షాలు డిమాండ్‌ను డీఎంకే ప్రభుత్వం పట్టించుకోక పోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాజా తెలిపారు.

ఆ పాఠశాలలో ముగ్గురే విద్యార్థులు!



పాఠాలు చదువుతున్న ముగ్గురు చిన్నారులు

చెన్నై, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా పి.రామనాథపురంలో పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు, ఓ విద్యార్థి చదువుతున్నారు. ఒకరు ఒకటో తరగతి, మరో విద్యార్థి మూడో తరగతి, ఇంకో విద్యార్థి ఐదో తరగతి. ఈ ముగ్గురికీ ఆ పాఠశాల హెడ్మాస్టరే పాఠాలు బోధిస్తున్నారు. ఈ ముగ్గురు విద్యార్థులకు అక్కడికి సమీపంలోని పాపయ్యాపురంలోని పాఠశాల నుంచి రోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం సిల్లైమలైపట్టి నుంచి మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్నారు. ఆ పాఠశాలలో అన్ని వసతులు ఉన్నప్పటికీ పిల్లలెవరూ చేరడం లేదు. ఈ విషయమై ఆ ఊరి ప్రజలు మాట్లాడుతూ... తమ గ్రామంలో 150 మంది నివసిస్తున్నామని, చాలా మంది ఉపాధి కోసం, కూలీ పనుల కోసం పక్క ఊళ్లకు వెళ్లిపోతుంటారని, వారితోపాటు వారి పిల్లలు కూడా పనులకు వెళ్లి రాత్రి ఇళ్లకు చేరుకుంటారని చెప్పారు. దీంతో ఆ పాఠశాలలో ఎవరూ చేరడం లేదని చెప్పారు. ప్రస్తుతం ముగ్గురితో నడుపుతున్న ఆ పాఠశాల ఏ సమయంలోనైనా మూతపడవచ్చని స్థానికులు చెబుతున్నారు.

పశ్చిమ బెంగాల్ ఉగ్రవాది అరెస్ట్



అన్వర్

ప్యారీస్, జూన్ 28: పశ్చిమ బెంగాల్‌కు చెందిన అన్వర్ అనే ఉగ్రవాదిని గ్రేటర్ చెన్నై పోలీసులతో కలిసి పశ్చిమ బెంగాల్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. దేశంలో నిషేధించిన ఉగ్రవాద సంస్థ అన్సార్ అల్-ఇస్లాంతో అన్వర్‌కు సంబంధాలున్నట్లు వార్తలొచ్చాయి. ఈ కేసులో ఇప్పటికే హబీబుల్లా అనే ఉగ్రవాదిని అరెస్ట్ చేసిన పోలీసులు, అతన్ని విచారించడంతో అన్వర్ వ్యవహారం బయటపడింది. అన్సార్ అల్-ఇస్లామ్ అనే సంస్థ భారతదేశంలో దాడికి పథకం రూపొందించిందని పసిగట్టిన పశ్చిమ బెంగాల్ పోలీసులు అన్వర్ స్థానిక కోయంబేడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐఏఎస్, ఐపీఎస్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ సమీపంలోని నిర్మాణ సంస్థలో పని చేస్తున్నట్లు తెలిసింది. దీంతో చెన్నైకి చేరుకున్న పోలీసులు స్థానిక పోలీసుల సహకారంతో అన్వర్‌ను అరెస్ట్ చేశారు.

కోటక్ మహీంద్ర కొత్త బీమా పథకాలు



కోటక్ జెన్-2 పథకాలను పరిచయం చేస్తున్న మహేష్ బాలసుబ్రమణ్యన్

ప్యారీస్, జూన్ 28: ఐఆర్డీఏఐ విజన్‌గా 2047 నాటికి అందరికీ బీమా నినాదంతో కొత్త బీమా పథకాలపై దృష్టి సారించినట్లు కోటక్ మహీంద్ర లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ మహేష్ బాలసుబ్రమణ్యన్ తెలిపారు.టి.నగర్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో కొత్తగా ప్రవేశపెట్టిన జెన్-2-జెన్ బీమాను వివరించారు. ఈ పథకాలను పూర్తిగా రక్షణ ప్రణాళికతో రూపకల్పన చేసినట్లు తెలిపారు. రెండు తరాలకు ఒకే ప్లాన్‌తో లబ్ధి కలుగజేసేలా ఫీచర్లు అందిస్తున్నట్లు తెలిపారు. తద్వారా వారసత్వానికి కూడా ఈ స్కీం వర్తిస్తుందని, ప్రాథమిక జీవిత బీమా మేరకు 60 లేదా 65 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు పూర్తి పథకాన్ని పిల్లలకు బదిలీ చేసే సౌలభ్యం కల్పించినట్లు తెలిపారు. ఐఆర్‌డీఏఐ విజన్ లక్ష్యంగా 2047 నాటికి అందరికీ బీమా నినాదంతో తమ సంస్థ ముందుకెళుందని ఆయన తెలిపారు.

రేపు టీఏవీఎంఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అభినందన సభ

ప్యారీస్, జూన్ 29: తమిళనాడు ఆర్యవైశ్య మహాసభ (టీఏవీఎంఎస్) ఆధ్వర్యంలో జీఎంఆర్ గిఫ్ట్ హ్యాంపర్స్ పథకం కింద ఈ నెల 30వ తేది విద్యార్థులకు అభినందన సభ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చెన్నై విభాగం చైర్మెన్ కేకే త్రినాథ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో... టీఏవీఎంఎస్, వాసవి సభ-యూత్ వింగ్ గ్రేటర్ చెన్నై, ఆర్యవైశ్య చారిటబుల్ అండ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వచ్చే ఆదివారం ఉదయం 8.30 గంటలకు స్థానిక జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థాన ప్రాంగణంలో ఉన్న కన్వెన్షన్ హాలులో విద్యార్థులకు ఉపకార వేతనం, ఆర్యవైశ్యులకు జీఎంఆర్ గిఫ్ట్ హ్యాంపర్స్‌ను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అతిథులుగా తంగుటూరి రామకృష్ణ, అజంతా కె.శంకరరావు, వైవీ నిరంజన్ కృష్ణ, తాడేపల్లి రాజశేఖర్, డి.రవిచంద్రన్, ముఖ్యఅతిథిగా జీఎంఆర్ గ్రూప్ డైరెక్టర్ మణిసంతోష్ బొమ్మిడాల, ఆత్మీయ అతిథిగా తారణ బొమ్మిడాల తదితరులు పాల్గొంటారని ప్రకటనలో తెలిపారు.

పోలీసు రక్షణ కోరుతూ హైకోర్టును ఆశ్రయించిన ప్రేమజంట

ప్యారీస్, జూన్ 28: తిరునల్వేలిలోని సీపీఎం కార్యాలయంలో కులాంతర వివాహం చేసుకున్న ప్రేమజంట తమకు పోలీసు భద్రత కల్పించాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తిరునల్వేలి జిల్లా పెరుమాళ్‌పురానికి చెందిన ఉదయ దాక్షాయణి, పాళయంకోటకు చెందిన మదన్‌కుమార్ ఇటీవల తిరునల్వేలిలోని సీపీఎం కార్యాలయంలో కులాంతర వివాహం చేసుకున్నారు. ఈ వివాహానికి వధువు కుటుంబీకుల నుంచి వ్యతిరేకత వచ్చింది. తమకు తెలియకుండా వివాహం జరిపించిన సీపీఎం కార్యాలయాన్ని వధువు కుటుంబీకులు ధ్వంసం చేశారు. ఈ నేపథ్యంలో, ఉదయ దాక్షాయణి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో... తన భర్త ఎస్సీ వర్గానికి చెందిన వారు కావడంతో తమ కుటుంబీకులు వ్యతిరేకిస్తున్నారని, తిరునల్వేలి జిల్లా వెల్లాలర్ మున్నేట్ర కళగం కార్యదర్శి తనను గదిలో బంధించి హింసించారని, అక్కడి నుంచి తప్పించుకొని సీపీఎం కార్యాలయానికి వెళ్లినట్లు తెలిపారు. కులాంతర వివాహం చేసుకున్న తాము స్వేచ్ఛగా జీవించేలా పోలీసు భద్రత కల్పించాలని, దీనిపై రాష్ట్ర డీజీపీకి ఈ నెల 25న సమర్పించిన వినతిపత్రంపై తగిన చర్యలు చేపట్టాల్సిందిగా పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ త్వరలో విచారణకు రానుందని కోర్టు వర్గాలు తెలిపాయి.

పట్టాలు దాటుతూ రైలు ఢీకొని ఇద్దరు వృద్ధ మహిళల మృతి

చెన్నై, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా దాదంబట్టి రైల్వేగేట్ వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఇద్దరు వృద్ధ మహిళలు దుర్మరణం చెందారు. దాదంబట్టి భారతీనగర్‌కు చెందిన కున్నియమ్మాదేశి (75), అదే ప్రాంతానికి చెందిన ధనలక్ష్మి (74) గురువారం రాత్రి అక్కడి రైల్వేగేటు పట్టాలు దాటుతుండగా సేలం నుంచి విరుదాచలానికి వేగంగా వస్తున్న ప్యాసింజర్ రైలు ఢీకొంది. దీనితో ఆ ఇరువురు ఆ ప్రాంతంలోనే తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

తిరుప్పూరులో 7.5 కిలోల గంజాయి స్వాధీనం

● మహిళ సహా ముగ్గురి అరెస్టు

చెన్నై, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు రైల్వేస్టేషన్ వద్ద ఎక్సైజ్ పోలీసులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీలో 7.5 కిలోల గంజాయి పట్టుబడింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఆ గంజాయిని తరలించుకొచ్చిన తేని ప్రాంతానికి చెందిన మురుగేశ్వర, కేరళ రాష్ట్రం ఆనైకట్టికి చెందిన అమీర్, మహమ్మద్ సబీర్ బాషాని అరెస్టు చేశారు. ఆ గంజాయి పొట్లాను ఆంధ్రప్రదేశ్‌లో కొనుగోలు చేసి తిరుప్పూరుకు తరలించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

పురస్కారాలతో బాధ్యత పెరుగుతోంది



అవార్డుగ్రహీతలతో అతిథులు, నిర్వాహకులు

పెరంబూర్, జూన్ 28: పురస్కారాలతో బాధ్యత పెరు గుతుందని పలువురు అవార్డు గ్రహీతలు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై కర్నాటిక్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనపరిచిన వారికి 'ది 8 ఎడిషన్ ఆఫ్ కర్నాటిక్ అవార్డ్స్-2024' పేరిట అవార్డుల ప్రదానోత్సవం గురువారం నగరంలో జరిగింది. ఈ కార్యక్రమంలో మిల్లెట్ క్వీన్ ఆథర్ ఇంద్ర నారాయణన్, కాలమిస్ట్ డాక్టర్ మీనాక్షి బజాజ్, కాలిడాయ్ మోటర్ వర్క్స్ సీఈఓ ప్రియ భార్గవ్, జులాహ ఫౌండర్ జయదేవి, సీబీఐ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఆర్కే. రాఘవన్‌కు పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాల్సన్స్ గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ శ్యాంపాల్, సవేరా హోటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ నీనా రెడ్డి, రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై సభ్యులు పాల్గొన్నారు.

కళ్లకుర్చి ఘటన... ఇప్పటివరకు 129 మంది డిశ్చార్జి

ప్యారీస్, జూన్ 28: కళ్లకుర్చిలో కల్తీ సారా తాగి చికిత్స పొందుతున్న బాధితుల్లో ఇప్పటివరకు 129 మంది కోలుకుని డిశ్చార్జి అయ్యారని, 32 మందికి చికిత్సలు కొనసాగిస్తున్నట్లు ప్రభుత్వాసుపత్రి వైద్యులు తెలిపారు. ఈ నెల 18వ తేది కళ్లకుర్చిలో కల్తీ సారా తాగి అనారోగ్యం పాలైన సుమారు 235 మంది కళ్లకుర్చి, సేలం, విల్లుపురం, ముండియంబాక్కం, పుదుచ్చేరి జిప్మర్ ఆసుపత్రి, స్థానిక రాయపేట ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్స పొందుతు న్నారు. వారిలో శుక్రవారం వరకు 65 మంది మృతిచెందారు. ఈ నేపథ్యంలో, బాధితుల్లో సంపూర్ణంగా కోలుకుని ఇప్పటివరకు 129మంది డిశ్చార్జి అయ్యార ని, మరో 32 మందికి చికిత్సలు కొనసాగిస్తున్నట్లు ఆరోగ్యశాఖ తెలిపింది.

13.75 కిలోల నగల మాయం కేసు సీబీఐ విచారణ

ప్యారీస్, జూన్ 28: పుదుకోటలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో 13.75 కిలోల నగల మాయం కేసుపై సీబీఐ అధికారులు శుక్రవారం ఉదయం విచారణ ప్రారంభించారు. ఈ బ్యాంక్‌లో అధికారిగా పనిచేసిన మారిముత్తు 2019 మేలో కన్పించడం లేదంటూ ఆయన భార్య రాణి పుదుకోట గణేశ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ప్రాథమిక విచారణలో, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పుదుకోట శాఖలో కస్టమర్లు తాకట్టుపెట్టిన 13.75 కిలోల నగలు కనిపించడం లేదని బ్యాంక్ అధికారులు ఫిర్యాదుచేశారు. ఇదిలా ఉండగా, పుదుకోట జిల్లా కొడియకరై సముద్రతీరంలో మారిముత్తు మృతదేహం పడి ఉండడం గుర్తించిన పోలీసులు, పలు కోణాల్లో విచారణ జరిపినా ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. దీంతో ఈ కేసు విచారణ చేపట్టిన మదురై సీబీఐ ఎస్పీ గణేశన్ నేతృత్వంలో 17 అధికారులు పుదుకోట పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు వెళ్లి సిబ్బంది వద్ద విచారణ ప్రారంభించారు.

నైజీరియా యువతికి రూ.9.45 లక్షల పరిహారం

● వినియోగదారుల ఫోరం ఉత్తర్వులు

ప్యారీస్, జూన్ 28: వైద్యచికిత్స కోసం ఆన్‌లైన్‌లో డబ్బు చెల్లించి మోసపోయిన నైజీరియా యువతికి రూ.9.45 లక్షల పరిహారం చెల్లించాలంటూ తిరువళ్లువర్ వినియోగదారుల ఫోరం ఉత్తర్వులు జారీ చేసింది. నైజీరియాకి చెందిన ఇబోమాపాల్ మనక్‌బేగ్ అనే యువతి.... ల్యుకేమియాతో బాధపడుతున్న తన భర్తకి నైజీరియాలోని పలు ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించినా ఫలితం కనిపించలేదని తెలిసింది. అక్కడి వైద్యుల సూచనల మేరకు ఆమె తనకు తెలిసిన కొంతమంది ద్వారా చెన్నైకి చెందిన డ్రీమ్స్ అనే ఆన్‌లైన్ సంస్థకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. 2016లో 10 వేల అమెరికా డాలర్లను తన భర్త వైద్యచికిత్సల కోసం ఆ ఆన్‌లైన్ సంస్థకు చెల్లించారు. అయితే భారతదేశానికి రాకముందే 2017 ఏప్రిల్‌లో ఆమె భర్త మృతి చెందాడు. దీంతో, వైద్యచికిత్స కోసం చెల్లించిన నగదును తిరిగివ్వాలని ఆమె కోరినా సంబంధిత సంస్థ పట్టించుకోలేదని తెలిసింది. దీంతో, బాధితురాలు ఇబోమా అందజేసిన ఫిర్యాదుపై విచారణ జరిపిన తిరువళ్లువర్ వినియోగదారుల ఫోరం, బాధితురాలికి రూ.9.45 లక్షల నష్టపరిహారం చెల్లించాలని సదరు ఆన్‌లైన్ సంస్థను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

పేద విద్యార్థులకు చేయూత



విద్యార్థి రామ్‌కు సహాయం చేస్తున్న దినేష్ శరవణన్

వేలూరు, జూన్ 28: స్థానిక సలవన్‌పేటలో సమీపంలోని కొండ దిగువన చిన్న ఇంట్లో నివసిస్తున్న రాం ప్రభుత్వ పాఠశాలలో ప్లస్‌టూ ఉత్తీర్ణులయ్యాడు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఉన్నత చదువులు చదివేందుకు ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రంగాపురానికి చెందిన ఐటీ ఉద్యోగి, సమాజ సేవకుడు దినేష్ శరవణన్, ఊరీసు కళాశాలలో రాం బీఏ హిస్టరీ చదివేందుకు ఫీజు చెల్లించారు. పేద విద్యార్థి చదువుకు చేయూతనిచ్చిన దినేష్ శరవణన్‌ను పలువురు అభినందించారు.

తరుణి

ఒకటీరెండు కాదు.. సుమారు 200కు పైగా దేశాల జాతీయ గీతాలు... అది కూడా ఆయా దేశాల ప్రజలు ఎలా ఆలపిస్తారో... ఆ రాగాలకు... శ్రుతికి తగినట్లుగా ఆలపిస్తూ అబ్బురపరుస్తోంది 15 ఏళ్ల సుభిక్ష హేమంత్... దేశం పేరు చెబితే చాలు ఠక్కున ఆ దేశ జాతీయ గీతాన్ని లయ తప్పకుండా మధురంగా ఆలపిస్తోంది... మన దేశ జాతీయ గీతంలోని పదాలనే మనం కొన్నిమార్లు మర్చిపోతున్న తరుణంలో 200 దేశాల జాతీయ గీతాలను ఎలా జ్ఞాపకం ఉంచుకుందా అనే ప్రశ్న తలెత్తడం సహజమే!

- పెరంబూర్









సుభిక్ష

ఆమె మేధస్సు అపారం

- 200లకు పైగా దేశాల జాతీయ గీతాలాపనం
- 15 ఏళ్ల విద్యార్థిని అద్భుత విన్యాసం

దేవుడిచ్చిన వరం....

'నా జ్ఞాపకశక్తి దేవుడిచ్చిన వరం...' అంటూ సుభిక్ష చెబుతున్న మాట వాస్తవమే అయినా .. ఆమె కఠోరశ్రమ అంతా ఇంతా కాదు. ఒక్కో దేశ జాతీయ గీతం ఆలపించేందుకు ఎంతో శిక్షణ పొందింది. ఒక్కో వ్యాఖ్యాన్ని రాసుకుని చదవడం, యూట్యూబ్‌లో ఆ పాటను పదేపదే వినడం, దాన్ని అలాగే జ్ఞాపకం పెట్టుకుని పాడడం కోసం ఎంతో శ్రమించింది.

గూగుల్‌లో వెదికి...

ఆ సమయంలో కెనడా జాతీయ గీతం విన్నా. అది బాగా నచ్చింది. అలా నేర్చుకోవడం మొదలుపెట్టా. అనంతరం సింగపూర్, మలేసియా, అమెరికా జాతీయ గీతాలను ఆలపించడం ప్రారంభించా.ఇంకా పలు దేశాల జాతీయ గీతాలు వెతికి మరీ నేర్చుకునేందుకు ప్రయత్నించా.అందుకోసం గూగుల్ సెర్చ్ చేసి వరుస క్రమంలో వెతికాను. తొలుత 60 దేశాల జాతీయ గీతాలు నేర్చుకున్నాను. అనంతరం అది 130గా మారింది. ప్రస్తుతం 200లకు పైగా దేశాల జాతీయ గీతాలు నాకు తెలుసు. అది కూడా ఆ దేశ ప్రజలు ఎలా పాడుతారో, అలాగే అదే శృతిలో ఆలపిస్తా. అందుకోసం యూట్యూబ్ చానల్‌లో సెర్చ్‌చేసి వాటిని వింటూ ఉంటా. పాటలోని పదాలను పుస్తకంలో రాసుకుంటా. నేను రాసుకున్న పదాలు, పాటలోని పదాలు ఒకటిగా ఉన్నాయోలేదో పరిశీలిస్తా. అనంతరం అచ్చు తప్పులు లేకుండా, రాసిన పదాలకు అనుగుణంగా నేర్చుకున్నా.

అన్ని భాషల్లో పాడాలి...

ఆ ఆసక్తి నన్ను చాలా దూరం తీసుకెళ్లింది. ఒక్కో దేశానికి ఒక్కో భాష ప్రస్తుతం నాకు 100 దేశాల భాషలు తెలుసు. వీటిలో కొన్ని దేశాల జాతీయ గీతాలు ఒకే భాషలో ఉంటాయి. అంటే ఇంగ్లీషు, అరబిక్, స్పానిష్, ఫ్రెంచ్, డచ్ తదితరాలు మరో దేశంలో కూడా రిపీట్ అవుతుంటాయి. ఎందుకంటే కొన్ని దేశాలు గతంలో ఆయా దేశాల్లో అంతర్భాగంగా ఉన్నవే. అందువల్ల ఆ దేశాల భాషలు కూడా పాత దేశం బాణీలోనే ఉంటాయి. దేశీయ భాషల్లోని అన్ని గీతాలతో పాటు అన్ని దేశాల జాతీయ గీతాలు ఆయా భాషల్లో పాడాలి. ఏదైనా సాధించాలనే లక్ష్యం ఉంటేనే విజయం సాధిస్తాం.

కుమార్తె ప్రస్థానంపై తండ్రి హేమంత్ మాట్లాడుతూ... "మన దేశ జాతీయ గీతం బెంగాలీ భాషలో ఉంటుంది. బంగ్లాదేశ్ జాతీయ గీతం కూడా బెంగాలీ భాషలో ఉంటుంది. ఈ రెండు రచించింది రవీంద్రనాథ్ ఠాగూర్. అందువల్ల భాషా పరంగా రెండు జాతీయ గీతాలు ఒకటిగా ఉంటాయి. దేశాలను గమనిస్తే వేర్వేరుగా ఉంటాయి. ఐకరాజ్యసమితి గుర్తింపు పొందిన దేశాల సంఖ్య 193. అలాగే, గుర్తింపు పొందాల్సిన జాబితాలో పాలస్తీనా సహా మరొక దేశం కూడా వుంది. అంటే మొత్తం మొత్తం 195 దేశాలన్నమాట. బర్బుడా లాగే కొన్ని దేశాలు గుర్తింపు పొందని జాబితాలో ఉన్నాయి. అలా అన్ని దేశాల జాతీయ గీతాలను సుభిక్ష నేర్చుకుంది" అంటూ గర్వంగా చెప్పారు .

"సుభిక్ష కోసం మేము తిరువొత్తియూర్ నుంచి మైలాపూర్‌కు నివాసం మార్చాం. అక్కడ ఓ గురువు వద్ద కర్ణాటక సంగీతం అభ్యసిస్తోంది. అలాగే, స్వతహాగా వెస్ట్రన్ కూడా నేర్చుకుంటోంది. మా పిల్లలు ఏదో సాధించాలనే ఉద్దేశం మాకు లేదు. ఏదో ఒకటి నేర్చుకోవాలని మాత్రమే చెప్పాం. ప్రస్తుతం ఆమె తన కోరిక చేసిన సాధనకు మార్గదర్శకంగా దోహదపడింది. సుభిక్ష 50 దేశాల జాతీయ గీతాలు నేర్చుకున్న తర్వాత, డాడీ, ఇలా ఎవరైనా చేశారా అని ప్రశ్నించింది. ఈ విషయాన్ని గూగుల్‌లో పరిశీలించగా ఎవరూ లేరని తెలిసింది. కొందరు 70 దేశాల జాతీయ గీతాలు ఆలపించి ఉండొచ్చు. కానీ, సక్రమంగా ఆలపించలేదు. కానీ, సుభిక్ష ప్రస్తుతం 130 దేశాల జాతీయ గీతాలు పాడే దృశ్యాలు వీడియోగా చిత్రీకరించాం.

సుభిక్షకు జ్ఞాపకశక్తి ఎక్కువ. ఈ పాటలు నేర్చుకోవడంతో పాటు చదువులో కూడా ముందంజలో ఉంటుంది. ఇది ఆమెకు దేవుడిచ్చిన వరం. అన్ని భాషలు ఆమె నోటి వెంట జాలువారుతున్నాయి. అమెరికన్ ఇంగ్లీషు వెంటనే రాదు. అలాగే, మాట్లాడితే వీరు భారతీయులు అని సులభంగా గుర్తిస్తారు. కానీ, సుభిక్ష ఏ దేశ జాతీయ గీతం పాడినా ఆ దేశ ప్రజలు పాడినట్లే ఉంటుంది. మైలాపూర్‌లోని కపాలేశ్వర స్వామి ఆలయానికి విదేశీయులు అధికంగా వస్తుంటారు. వారిని ఏ దేశం అని అడిగి, వారి జాతీయ గీతం పాడమని చెప్పి వినాలని నేను సుభిక్షకు సూచించేవాడిని. అలా వారు పాడుతుంటే ఆ పాటలోని పదాల ఉచ్చారణ, శృతి తదితరాలను ఆమె నేర్చుకుంది. కొందరికి వారి దేశం జాతీయ గీతం పూర్తిగా తెలియదు. అప్పుడు వారు "మాకే మా దేశ జాతీయ గీతం రాదు... నువ్వు ఎలా స్పష్టంగా పాడుతున్నావు' అంటూ సుభిక్షను వారు అభినందించేవారు. ఓ సారి శాంథోమ్ చర్చికి రష్యా దేశస్థులు విచ్చేయగా, సుభిక్ష వారి ముందు వారి దేశ జాతీయ గీతం పాడడంతో వారు ఆశ్చర్యపోయారు. అలాగే, హిందువుల ఆధ్యాత్మిక పాటలతో పాటు క్రైస్తవులు, ముస్లిం మతానికి సంబంధించిన పాటలు కూడా శ్రావ్యంగా ఆలపిస్తుంది. ఆమెకు దేవుడు సంగీతమే. ప్రస్తుతం సుభిక్ష 'కలైంజర్ నూరు' శతజయంతి సందర్భంగా 100 దేశాల గీతాలు ఆలపించి గిన్నిస్ సాధన చేయించాలనే ఆలోచనలో ఉన్నాం. అదే మేము కలైంజర్‌కు ఇచ్చే నివాళి.

జపాన్ జాతీయ గీతం చిన్నది. మొత్తం ఐదు వాక్యాలు మాత్రమే ఉంటాయి. అదే సమయంలో గ్రీస్ దేశ జాతీయ గీతం చాలా పెద్దది. 50 నిమిషాలు నిడివి కలిగిన ఈ పాటను కొంత కుదించి ఆలపిస్తున్నారు. అలాగే గ్రీస్, సైప్రస్ దేశాల జాతీయ గీతం ఒక్కటే. దక్షిణాఫ్రికా, టాంజానియా, జాంబియా తదితర మూడు దేశాల పాటల పదాలు మారుతాయి కానీ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఒక్కటే. స్పెయిన్ జాతీయ గీతంలో పదాలు ఉండవు, కేవలం సంగీతం మాత్రమే ఉంటుంది. ఇవన్నీ ఆయా దేశాల జాతీయ గీతాలకు సంబంధించి కొన్ని వ్యత్యాసాలు మాత్రమే. ఆయా దేశాల చరిత్ర, సంప్రదాయాలు తెలుపుతూ ప్రజల్లో ఐకమత్యం కలిగించేలా జాతీయ గీతాలుంటాయి. మన దేశంలో రాష్ట్ర భాషల్లోనూ గీతాలున్నాయి. 'తమిళ్ తాయ్ వాళ్తు' లాగా ఆయా రాష్ట్రాలకు ప్రత్యేక గీతాలున్నాయి. ప్రస్తుతం దక్షిణ రాష్ట్రాల గీతాలు నేర్చుకున్న సుభిక్ష, ఉత్తరాది రాష్ట్రాల గీతాలు పాడేందుకు కృషి చేస్తోంది" అంటూ ఆయన తన కుమార్తె గురించి గర్వంగా వివరించారు.

నా కల... నేపథ్య గానం...

నేపథ్య గాయకురాలు కావాలనే ఆశతో నా సాధన ప్రారంభించా. అదే సమయంలో గాయనిగా అన్ని భాషల్లో పాడాలని ఆశ ఉండేది. కర్ణాటక సంగీతం, వెస్ట్రన్ పాటలు, ర్యాంప్ పాటలు పాడాలని ఆశ. అదే నేను జాతీయ గీతాలు ఆలపించేందుకు నాందిగా మారింది" అంటోంది సుభిక్ష. ఇంకా ఆమె తన ప్రతిభాపాటవాల గురించి ఇలా వివరించింది.

పుట్టింది చెన్నైలోనే....

"నేను పుట్టి పెరిగింది చెన్నైలోనే. నా తండ్రి హేమంత్, ఇళ్లకు సంబంధించిన ఇంటీరియర్ డిజైనర్. తల్లి మోహన హోం మేకర్. చెల్లెలు కనిషా ప్రస్తుతం 6వ తరగతి చదువుతోంది. కరోనా లాక్‌డౌన్‌లో నేను సంగీతంపై దృష్టి సారించా. అప్పటివరకు నేను గాయకురాలిని అవుతానని ఊహించనే లేదు. టీవీలో సినిమా పాటలు చూస్తుండే దాన్ని. కొన్ని పాటలు బాగున్నాయి అనిపించి హం చేయడం ప్రారంభించా. అప్పుడే గాయకురాలిని అవ్వాలనే కోరిక బలంగా కలిగింది. ఆ సమయంలో నేను 6వ తరగతి చదువుతున్నా. తొలుత తమిళ సినిమా పాటలు పాడా. అనంతరం హిందీ, మలయాళం, తెలుగు పాటలు కూడా పాడాలని అనిపించింది. అప్పటినుంచి పలు భాషల్లోని సినిమా పాటలు విని పాడడం ప్రారంభించా. ఇతర దేశాల్లోని పాటలు ఎలా ఉంటాయో తెలుసుకోవాలనే ఆతృత మొదలైంది.



తల్లిదండ్రులతో...



ఆడియో రిలీజ్ దృశ్యం

సన్నీ లియోన్,ప్రియమణి నటించిన
'కొటేషన్ గ్యాంగ్'

బాలీవుడ్ నటుడు జాకీ ష్రాఫ్, సన్నీలియోన్, ప్రియమణి నటించిన తాజా చిత్రం 'కొటేషన్ గ్యాంగ్'. వివేక్ కుమార్ కన్నన్ దర్శకుడు. ఫిల్మినాటి ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై నిర్మించిన ఈ సినిమాను జులైలో విడుదల చేయనున్నారు. దీన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి నగరంలో ఆ చిత్ర ఆడియో, ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో హీరోయిన్ సన్నీ లియోన్ మాట్లాడుతూ... 'ఈ సినిమాలో పలు యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయి. వాటిని చూశాక నా పట్ల మీలో ఉన్న అభిప్రాయం మారుతుందని నమ్ముతున్నా. ఈ సినిమా ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది' అన్నారు. హీరోయిన్ ప్రియమణి మాట్లాడుతూ... 'నా సినీ కెరీర్‌లో ఇప్పటివరకు కాంట్రాక్ట్ కిల్లర్ పాత్రను పోషించలేదు. దర్శకుడు వివేక్ రూపొందించిన శకుంతల పాత్రను బాగా చేశానని భావిస్తున్నా. సన్నీ లియోన్ గురించి వేరే అభిప్రాయం మీలో ఉండొచ్చు. కానీ, ఈ సినిమాలో పద్మ పాత్ర ఆమె పట్ల మీకున్న అభిప్రాయాన్ని మారుస్తుంది' అన్నారు. నిర్మాత గాయత్రి సురేష్ మాట్లాడుతూ... 'ఈ సినిమాకు నిర్మాతగా అవకాశం ఇచ్చిన దర్శకుడికి ధన్యవాదాలు. సాధారణంగా మల్టీస్టారర్ చిత్రాలంటే అనేక సమస్యలు ఉంటాయి. కానీ, ఒక్క సమస్య కూడా లేకుండా సాఫీగా షూటింగ్ పూర్తి చేయడం సంతోషంగా ఉంది' అన్నారు. దర్శకుడు వివేక్ కన్నన్ మాట్లాడుతూ... 'ఈ సినిమాను ప్రియమణితో ప్రారంభించా. ఆ తర్వాత జాకీ ష్రాఫ్, సన్నీ లియోన్‌వచ్చి చేరారు. కశ్మీర్‌లో చిత్రీకరణ అంటే అంత సులభం కాదు. థియేటర్‌లో బెస్ట్ ఎక్స్‌పీరియన్స్‌ను ఈ మూవీ ఇస్తుంది. వచ్చే నెలలో విడుదల చేసేలా ప్లాన్ చేశాం' అని పేర్కొన్నారు. అలాగే, సహ నిర్మాత వివేకానందన్, నటులు ప్రదీప్, అశోక్, గేయరచయిత అరుణ్ భారతి, నటి అక్షయ, కెమెరామెన్ అరుణ్ పద్మనాభన్, ఎడిటర్ వెంకట్రామన్ తదితరులు ప్రసంగించారు.

'రాయన్' రాక ఖరారు!

ధనుష్ హీరోగా నటించిన 50వ చిత్రం 'రాయన్'. కథానాయకుడిగా నటించడంతో పాటు ఈ చిత్రానికి కథను సమకూర్చి దర్శకత్వం కూడా వహించారు. ఇప్పటికే అన్ని రకాల నిర్మాణ పనులు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో జులై 26న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు చిత్ర బృందం గురువారం ఓ పోస్టరు ద్వారా అధికారికంగా ప్రకటించింది. ఓం ప్రకాష్ కెమెరామెన్‌గా పనిచేయగా, ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం అందించారు. ప్రముఖ నిర్మాత కళానిధి మారన్ తమ సొంత నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ పతాకంపై నిర్మించారు. ఇందులో ధనుష్‌తో పాటు ఎస్‌జే సూర్య, సెల్వరాఘవన్, ప్రకాష్‌రాజ్, సందీప్‌కిషన్, కాళిదాస్ జయరాం, అపర్ణ బాలమురళి, వరలక్ష్మి శరత్‌కుమార్ తదితరులు నటించారు.



'రాయన్'లో ఓ దృశ్యం

నా ప్రియుడికి పెళ్లైపోయింది

- లక్ష్మీ మేనన్

తన ప్రియుడికి వివాహమైందని, ఆయన తన ఫ్యామిలీతో హాయిగా జీవిస్తున్నారని, తను సినీ రంగంలోకి అడుగుపెట్టడంతో మా ప్రేమకు బ్రేకప్ పడిందని హీరోయిన్ లక్ష్మీ మేనన్ వెల్లడించారు. ప్రభు సాల్మన్ దర్శకత్వంలో రానా దగ్గుబాటి నటించిన చిత్రం 'గుంకి'. హీరోయిన్‌గా లక్ష్మీ మేనన్ నటించారు. ఆ తర్వాత అనేక చిత్రాల్లో ఆమె నటించారు. కానీ, వాటిలో ఏ ఒక్క సినిమా కూడా ఆమెకు బ్రేక్ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో తాజాగా తన ఫస్ట్ లవ్ గురించి మాట్లాడుతూ... 'ఇప్పటివరకు నన్ను ఎవరూ ప్రేమించలేదని చెప్పడం లేదు. నా స్కూల్ డేస్‌లో ఓ వ్యక్తిని ఇష్టపడ్డా. ఈ విషయాన్ని నేనే ముందుగా చెప్పా. కొన్ని రోజుల తర్వాత అతని అభిప్రాయాన్ని వెల్లడించారు. అప్పటి నుంచి మేమిద్దరం చాటుమాటుగా మాట్లాడుకుంటూ వచ్చాం. ఈ క్రమంలో నాకు సినిమా అవకాశాల రావడంతో మా ప్రేమను కొనసాగించలేకపోయాం. అతను ఇటీవల పెళ్లి చేసుకున్నారు' అని వివరించారు.

చిత్రజ్యోతి



సినిమా అనేది ఓ ప్రత్యేక భాష

- అగ్ర నటుడు కమల్
- ప్రేక్షకుడిగా 'కల్కి' సినిమా ఆసక్తిగా చూశా

సినిమా అనేది ఒక ప్రత్యేక భాష అని, అలాంటి సినిమాపై మనమే భాషను బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నిస్తున్నామని అగ్రనటుడు కమల్ అభిప్రాయపడ్డారు. గురువారం విడుదలైన 'కల్కి 2898 ఏడీ' చిత్రాన్ని ఆయన చెన్నైలో ప్రత్యేకంగా వీక్షించారు. ఆ తర్వాత విలేకరులతో మాట్లాడుతూ... పురాణానికి సైన్స్ ఫిక్షన్ జోడించి దర్శకుడు నాగ్‌అశ్విన్ తెరకెక్కించిన తీరు అద్భుతం. ఇలాంటి ప్రాజెక్టులో నేను భాగస్వామి కావడం సంతోషంగా ఉంది. 'కల్కి' తొలి భాగంలో నా పాత్ర చిన్నదిగానే ఉంటుంది. రెండో భాగంలో పూర్తిస్థాయిలో ఉంటుంది. సినిమా చూస్తుంటే బాలల చిత్రంగా ఉంది. మనలోని ప్రతి ఒక్కరిలో అల్లరితనం ఉంది. ఈ సినిమాలో పాటలు లేవు అని ధైర్యంగా చెప్పవచ్చు. ఫైట్ సన్నివేశాలున్నాయి. గతంలో జేమ్స్ బాండ్ చిత్రాలు ఇదే కోవలో ఉండేవి. వాటిని ప్రేక్షకులు విశేషంగా ఆదరించిన సందర్భాలు అనేకం. అలాంటిదే ఈ చిత్రం కూడా. ఒక సాధారణ ప్రేక్షకుడిలా ఎంతో ఆసక్తి ఈ సినిమాను తిలకించా. సినిమా విజయానికి భాషతో పనిలేదు. అసలు సినిమానే ఓ ప్రత్యేక భాష. అలాంటి సినిమాపై మనమే బలవంతంగా భాషను రుద్దేందుకు ప్రయత్నిస్తున్నాం. 'మరోచరిత్ర' చిత్రం తెలుగు చిత్రమైనప్పటికీ అన్ని భాషల్లో ఘన విజయం సాధించింది. ఇదే సినిమాకు భాష అక్కర్లేదని చెప్పడానికి ఓ మంచి ఉదాహరణ' అని పేర్కొన్నారు. 'ఇండియన్-2' చిత్రం ప్రమోషన్ కార్యక్రమాలను ప్రారంభించి, చెన్నై, ముంబైలలో పూర్తి చేశాం. సింగపూర్‌లో నిర్వహించి, మళ్లీ స్వదేశంలో ప్రమోషన్ కార్యక్రమాలు చేపడుతాం' అని కమల్ వివరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న కమల్

చెట్టు కొమ్మల మధ్య తల చిక్కుకుని
తంటాలు పడ్డ ఎలుగుబంటి



రెండు కొమ్మల మధ్య చిక్కుకున్న తలను లాగుతూ తంటాలు పడుతున్న ఎలుగుబంటి

చెన్నై, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కున్నూరు సమీపం పళతోట్టమ్‌లో రెండు కొమ్మల మధ్య ఎలుగుబంటి తల చిక్కుకుంది. శుక్రవారం ఉదయం ఆ కొమ్మల మధ్య ఇరుకున్న తలను తీసేందుకు ఆ ఎలుగుబంటి నానా తంటాలు పడింది. గమనించిన స్థానికులు తమ సెల్‌ఫోన్లలో ఎలుగుబంటి ప్రయత్నాన్ని చిత్రీకరించారు. ఆ తర్వాత ఎలుగుబంటి కొమ్మల మధ్య చిక్కుకున్న విషయాన్ని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకునేలోపే ఆ ఎలుగుబంటి అరగంటసేపు పోరాడి ఎట్టకేలను తలను కొమ్మల మధ్య నుంచి లాగవంగా వెనక్కు లాక్కుని అడవిలోకి పారిపోయింది. ఈ సంఘటన తర్వాత ఆ ప్రాంతంలో అటవీ అధికారులు సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశారు.



శుక్రవారం అసెంబ్లీ సమావేశాలను వీక్షించడానికి సచివాలయం వద్ద బారులు తీరిన కళాశాల విద్యార్థినులు



నీట్ రద్దు తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ శాసనసభ నుంచి వాకౌట్ చేస్తున్న బీజేపీ ఎమ్మెల్యేలు నయినార్ నాగేంద్రన్, వానతి శ్రీనివాసన్ తదితరులు

పెన్నాగరం మునియప్పన్
ఆలయ హుండీలో రూ.90కోట్ల చెక్కు



చెన్నై, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జిల్లా పెన్నాగరం సమీపం పిలయనూరు అగ్రహారంలో సుప్రసిద్ధ అగ్రహార మునియప్పన్ ఆలయ హుండీలో భక్తుడొకరు వేసిన రూ.90 కోట్ల చెక్కును చూసి ఆలయ అధికారులు ఆశ్చర్యపోతున్నారు. ఆ ఆలయంలో ప్రతి అమావాస్య రోజు ప్రత్యేక ఉత్సవాలు, మార్గశిర మాసం రెండో మంగళవారం వార్షిక ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనే భక్తులంతా అక్కడి అన్నదానం హుండీలో నగదు కానుకలు వేస్తుంటారు. ఆ కానుకలను ప్రతినెలా లెక్కిస్తుంటారు. ఈ మేరకు ఈనెల 27న మునియప్పన్ ఆలయ హుండీ కానుకలను ఆలయ సిబ్బంది లెక్కిస్తుండగా రూ.90.42 కోట్ల విలువైన సౌత్ ఇండియన్ బ్యాంక్ చెక్కు లభించింది. ఆ చెక్కులో రాసి ఉంచిన నగదును చూసిన లెక్కింపు సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. తమ ఆలయానికి 90 కోట్లకు పైగా చెక్కు రూపంలో కానుకను చెల్లించిన ఆ భక్తుడెవరో కదా అని ఆశ్చర్యపడసాగారు. ఆలయంలోని మునియప్పన్ స్వామివారి పేరుమీదే ఉన్న ఆ చెక్కు దిగువన మహేంద్రన్ అనే సంతకం ఉంది. ఆ చెక్కును స్వాధీనం చేసుకున్న దేవాదాయ శాఖ అధికారులు ధర్మపురి బ్రాంచి సౌత్ ఇండియన్ బ్యాంక్‌లో మహేంద్రన్ ఖాతాలో 90 కోట్లకు పైగా నగదు ఉందో లేదో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నా. ఒక వేళ ఆ బ్యాంక్ అంత పెద్ద మొత్తం ఉంటే మునియప్పన్ స్వామి ఆలయం దశ తిరిగినట్లేనని ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు. ఒకట్రెండు రోజుల్లో ఆ చెక్కు అసలైనదా, లేక ఆట పట్టించేందుకు హుండీలో వేశారా అనే విషయంపై సస్పెన్స్ వీడుతుందని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

షోళింగనల్లూర్‌లో 4 అంతస్తుల బ్రిడ్జి

ఐసీఎఫ్, జూన్ 28: స్థానిక షోళింగనల్లూర్‌లో 4 అంతస్తుల బ్రిడ్జి నిర్మించనున్నారు. చెన్నైలో రెండో విడత మెట్రోరైలు పథకం మాధవరం - సిరుచ్చేరి, పూందమల్లి - షోళింగనల్లూర్, పూందమల్లి - లైట్‌హౌస్ మధ్య 118 కి.మీ దూరం ఏర్పాటు కానుంది. మొత్తం 108 స్టేషన్లలో 84 రైల్వేస్టేషన్లు సొరంగమార్గంలో ఏర్పాటు కానున్నాయి. ఇందులో మాధవరం - సిరుచ్చేరి మార్గంలో ఓఎంఆర్‌లో 20 కి.మీ దూరం ఫ్లైఓవర్ నిర్మిస్తున్నారు. మాధవరం - సిరుచ్చేరి, పూందమల్లి - షోళింగనల్లూర్ మార్గాలు షోళింగనల్లూర్‌లో అనుసంధానం కానున్నాయి. ప్రధాన జంక్షన్‌గా షోళింగనల్లూర్ ఉండడంతో ప్లాట్‌ఫాంలు, రోడ్డు, రెండు రైల్వేస్టేషన్లు అని 100 అడుగుల ఎత్తులో 4 అంతస్తులతో బ్రిడ్జి నిర్మిస్తున్నారు. మొదటి అంతస్తులో ప్లాట్‌ఫాం, రెండో అంతస్తులో రౌండ్ ఠానా బ్రిడ్జి, మూడో అంతస్తులో పూందమల్లి - షోళింగనల్లూర్ స్టేషన్, నాల్గో అంతస్తులో మాధవరం - సిరుచ్చేరి స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు.

బ్రిడ్జి నమూనా

